క్లుప్తంగా

యూరియా నిల్వచేస్తే కఠిన చర్యలు: ఏడీఏ



రికార్డులు పరిశీలిస్తున్న ప్రవీణ్‌కుమార్

దుబ్బాక: యూరియాను రైతులకు పంపిణీ చేయకుండా అక్రమంగా గోదాంలలో నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా ఉన్నా దుకాణదారులు ఇవ్వడం లేదని, పురుగుమందులు, ఇతర మందులు తీసుకుంటనే ఇస్తామంటున్నారని రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. యూరియాను సూచించిన ధరకే రైతులకు విక్రయించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కరాటేతో ఆత్మరక్షణ



బహుమతులు అందజేస్తున్న సైదులు, మధు

సిద్దిపేటఅర్బన్: బాలికల ఆత్మరక్షణకు, ఆత్మవిశ్వాసానికి కరాటే సాధన ఎంతో అవసరమని షోటోకాన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు బూడిద సైదులు అన్నారు. స్థానిక స్టీఫెన్స్ హైస్కూల్‌లో త్రినేత్ర షోటోకాన్ కరాటే ఫౌండర్, చీఫ్ ఎగ్జామినర్ కెమ్మసారం మధు విద్యార్థులకు మంగళవారం బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమం నిర్వహించారు. సైదులు మాట్లాడుతూ బాలికలు తమను తాము రక్షించుకోవడానికి కరాటే ఎంతోఉపయోగపడుతుందన్నారు. బెల్ట్ గ్రేడింగ్‌లో పాల్గొన్న 80 మంది విద్యార్థులకు బెల్టులతోపాటు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తడ్కపల్లి మాజీ ఉప సర్పంచ్ అంబటి రవికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న నాగరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేట అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు ఇవ్వడం లేదని ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను డీసీసీ కార్యదర్శి మీసం నాగరాజు ఖండించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్దిపేట అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కోట్ల రూపాయలు విడుదల చేసిందన్నారు. హరీశ్‌రావు పదేళ్లు మంత్రిగా ఉండి సిద్దిపేటను ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కాస్త వర్షం కురిస్తే చాలు సిద్దిపేటలో రోడ్లు వాగులను తలపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు గణేశ్, మహేందర్ రెడ్డి, మల్లేశం, బాబు, సంపత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ



విద్యార్థికి షూస్ అందజేస్తున్న నర్సింహారావు

గజ్వేల్: మండలంలోని రిమ్మనగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో తన సొంత ఖర్చులతో విద్యా వలంటీర్ ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి వెంకటనర్సింహారావు ముందుకొచ్చారు. మంగళవారం తన సతీమణి విజయలక్ష్మి జన్మదినం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులను షూస్ పంపిణీ చేశారు. పాఠశాలలో టీచర్ల కొరత ఉందని హెచ్ఎం నాగభూషణం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంకటనర్సింహారావు స్పందించి విద్యా వలంటీర్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు సురేశ్, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తం

దౌల్తాబాద్(దుబ్బాక): విద్యార్థి దశలో విద్యార్థులు మద్యం, సిగరెట్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ అరుణ్‌కుమార్ అన్నారు. దొమ్మాట పాఠశాలలో హెచ్ఎం బాసిత్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి సమకూర్చిన విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ విక్రమ్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజేశ్వర్, మధు, రవి, యాదగిరి, కిషన్‌రెడ్డి, రాజు, రమేశ్, సాగరిక, చందు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు

వారానికోసారి సరఫరా
- వ్యవసాయ బావులే దిక్కు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఖాళీ బిందెలతో మహిళల నిరసన



మంగోల్ గ్రామంలో నల్లా వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చేవారు కరువయ్యారు. దీంతో మహిళలు నల్లా వద్ద మంగళవారం ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. నెలా పదిహేను రోజులుగా గ్రామానికి తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. వారానికి ఒకరోజు సరఫరా అవుతుండటంతో సమీపంలోని వ్యవసాయ బోరుబావుల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నామంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

పక్కనే ప్రాజెక్టు ఉన్నా..

గ్రామానికి దగ్గరే మల్లన్నసాగర్ ప్రాజెక్టు ఉంది. దానికి తోడు గ్రామ శివారులో గత ప్రభుత్వం 540 ఎంఎల్‌డీ(వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) సామర్థ్యం గల ప్లాంట్‌ను నిర్మించింది. దాని ద్వారా ఆరు జిల్లాలలోని 16 మున్సిపాలిటీలు, 1,920 గ్రామాలకు రోజూ తాగునీరు సరఫరా జరుగుతోంది. కానీ మంగోల్ గ్రామానికి మాత్రం గజ్వేల్ మండలంలోని కోమటి బండ వద్ద నిర్మించిన ప్లాంట్ నుంచి నీరు సరఫరా జరుగుతోంది. కాని వారం రోజులకోమారు మాత్రమే నల్లాల ద్వారా నీగా సరఫరా జరుగుతోంది. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఎల్లు లలిత, పద్మ, సిద్దమ్మ, మణెమ్మలతోపాటు మరి కొందరు మహిళలు వాపోయారు.

తప్పని తిప్పలు

గ్రామంలో సుమారు రెండు వేల జనాభా నివాసం ఉంటుంది. నీటి సరఫరా కాకపోవడంతో మహిళలు వ్యవయసాయ బావుల వద్దకు వెళ్లి తమ పిల్లల సహాయంతో బిందెలతో నీళ్ల తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నారు. నీటి సరఫరాలో సాంకేతికపరమైన లోపాలు ఏర్పడినప్పుడు, తాత్కాలికంగా ఇబ్బందులు తలెత్తినప్పుడు సింగల్ ఫేజ్ బోరుమోటార్ల ద్వారా మినీ ట్యాంకుల్లోకి నీరు చేరేలా ఏర్పాట్లు కూడా చేయలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా ప్రస్తుతానికి అందించాలని కోరారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యనుపరిష్కరించాలని వేడుకున్నారు.

నీటి కష్టాలు తీర్చండి..



రామక్కపేటలో ఖాళీ బిందెలతో మహిళలు

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట గ్రామంలో తాగునీరు సరఫరా కాకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో 15 రోజుల నుంచి నీళ్లు రావడం లేదు. వారు మాట్లాడుతూ నీళ్ల రాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామన్నారు. కనీసం వంట చేసుకోవడానికి గుక్కెడు నీళ్ల లేవని వాపోయారు. స్నానం చేయడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా తిప్పలు తప్పడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లాల ద్వారా నీళ్ల రాకపోతే అధికారులు ట్యాంకర్ల ద్వారా నీళ్ల సరఫరా చేయక పోవడం బాధాకరం అన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో నీటి కొరత సమస్య తీర్చాలని కోరారు.



మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

స్థానిక సంస్థల ఎన్నికల్లో రాణించాలి

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాణించాలని, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యకర్తలతో మంగళవారం ఆయన మాట్లాడారు. చిన్నకోడూరు, నంగునూరు మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చుతోందన్నారు. పార్టీలోని ప్రతి నాయకుడు, కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, అత్తు ఇమామ్, గంప మహేందర్‌రావు, కలీమొద్దిన్, బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, మార్క సతీశ్, దాస అంజన్న, పయ్యావుల ఎల్లం యాదవ్, సాకి ఆనంద్, అలకుంట మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ జోన్‌లో కలపండి

సిద్దిపేటజోన్: జిల్లాను చార్మినార్ జోన్ పరిధిలో కలపాలంటూ టీఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్‌కు వినతి పత్రం అందజేశారు. సిద్దిపేట జిల్లాను సిరిసిల్ల రాజన్న జోన్ పరిధిలో కలపడం వల్ల ఉద్యోగులు పదోన్నతుల అంశంలో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి మంత్రి స్పందించి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మంత్రిని కలిసిన వారిలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి విక్రమ్ రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు

ఆర్అండ్ఆర్ కాలనీ సమస్యలు పరిష్కరించండి

గజ్వేల్: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌కు వినతి పత్రం అందజేశారు. మంగళవారం సిద్దిపేటకు వెళ్తున్న మంత్రిని మార్గమధ్యంలో కలిసి ఈ వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి వివేక్ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన పైకప్పు

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్



రామవరంలో పాక్షికంగా కూలిన ఇల్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ ఇంటి పైకప్పు కూలింది. మండలంలోని రామవరం గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వల్లపు సారయ్య ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు మహేందర్ ఆ ఇంటిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో చాలా మంది పేదలకు సరైన ఇళ్లు లేవని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చెప్పిన వారికే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యంవల్ల అసలైన నిరుపేదలకు ఇళ్లు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్హులకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అసంపూర్తి భవనం.. పార్కింగ్ ప్రదేశం

- పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లకు మోక్షం ఎప్పుడు?
- అర్ధంతరంగా నిలిచిన నిర్మాణాలు
- ఇబ్బందుల్లో ప్రజలు

నిధుల కొరత మూలంగా పీహెచ్‌సీ సబ్ సెంటర్ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ట్రాక్టర్లకు పార్కింగ్ స్థలంగా మారింది.



పార్కింగ్ ప్రదేశంగా మారిన అసంపూర్తి తొగుట పీహెచ్‌సీ సబ్ సెంటర్ భవనం

తొగుట(దుబ్బాక): మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తొగుట, వెంకట్రావుపేట, ఎల్లారెడ్డిపేట, గుడికందుల, వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్ సబ్ సెంటర్లున్నాయి. అందులో తొగుట, వెంకట్రావుపేట సబ్ సెంటర్లకు సొంత భవనాలు లేవు. దీంతో అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాల నుంచి ప్రజలు నిత్యం అధిక సంఖ్యలో వైద్య సేవల కోసం వస్తుంటారు. సిబ్బంది చిన్నారులకు టీకాలు, గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందిస్తున్నారు.

అడ్డంకులెన్నో..

తొగుట, వెంకట్రావుపేట సబ్ సెంటర్‌లకు భవనాలు నిర్మించేందుకు రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో అధికారులు టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అయితే వెంకట్రావుపేటలో స్థల వివాదం కారణంగా భవన నిర్మాణం ప్రారంభించలేదని అధికారులు చెప్పారు. తొగుటలో సబ్ సెంటర్ భవనం స్లాబ్ వేశారు. ఈ క్రమంలో శాసనసభ, పార్లమెంట్‌కు ఎన్నికలు రావడంతో ఎన్నికల కోడ్ అమలు మూలంగా అధికారులు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మారడంతో సబ్ సెంటర్‌కు రావాల్సిన నిధులు నిలిచిపోయాయి.

నిధులు విడుదల చేయండి..

రెండేళ్లు కావస్తున్నా నిధులు మంజూరుకాకపోవడంతో భవనాలు అసంపూర్తిగానే మిగిలాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు విడుదలచేసి పనులు పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలపై కేంద్ర బృందం ఆరా



అయినాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో కేంద్ర బృందం

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై నేషనల్ లైవ్‌లీహుడ్ మిషన్(ఎన్ఎల్ఎం) కేంద్ర బృందం జోస్లీజోసఫ్, వినోద్, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్‌గౌడ్, డీఎల్‌పీఓ మల్లికార్జునరెడ్డితో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు, పేదరిక నిర్మూలన చర్యలు, స్వయం ఉపాధి రుణాల వితరణ లాంటి అంశాలపై ప్రజలు, మహిళాసంఘాల సభ్యులతో చర్చించారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులనులను పరిశీలించారు. ఎంత ఖర్చు అవుతుంది? ప్రభుత్వం ఎంత చెల్లిస్తుందని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులలో చేపట్టే పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీఓ శ్రీనివాస వర్మ, పీఆర్ ఏఈ శివకుమార్, ఏపీఓ బాలలింగం, ఏంఈఓ రమేశ్, హౌసింగ్ ఏఈ మేఘన, ఏకేపీ ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాల్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ఆస్పత్రిలో అంధకారం’పై జిల్లా వైద్యాధికారి ఆరా

సాక్షి ఎఫెక్ట్

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నలభై రోజులుగా విద్యుత్ సౌకర్యం లేకపోవడంపై జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్‌కు ఫోన్‌చేసి ఆస్పత్రిలో వసతులపై ఆరా తీశారు. సాక్షిలో పత్రికలో మంగళవారం ప్రచురితమైన ‘అంధకారంలో ఆస్పత్రి’ అనే కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు పీహెచ్‌సీలో విద్యుత్ లేకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇతర సమస్యలు, రోగుల ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబానికి ‘కౌండిన్య’ అండ



కుట్టుమిషన్ అందిస్తున్న కేజీకేఎస్ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ప్రమాదానికి గురైన ఓ కల్లుగీత కార్మికుడి కుటుంబానికి కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. మండల పరిధిలోని వీరన్నపేట గ్రామానికి చెందిన బొందుగుల చంద్రశేఖర్‌గౌడ్ గతేడాది మే నెలలో ప్రమాద వశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గాయపడ్డాడు. నడుము, కాళ్లు, వెన్నుపూస విరిగి మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న కౌండిన్య అసోసియేషన్ ప్రతినిధులు నాతి గణేశ్, బాల్నే రామచంద్రుడు మంగళవారం బాధితుడిని పరామర్శించారు. రూ.20 వేలు విలువగల కుట్టుమిషన్‌ను అందించారు. కల్లుగీత కార్మిక సంఘం సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్, రాజు, రాములు, నరేశ్, రాము, చందు, నాగేశ్, నర్సింహులు, రాజు, శ్రీనివాస్, అంజయ్య, సత్యనారాయణ, రాములు, లక్ష్మణ్, మల్లయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

జ్వరం వస్తే ఏ గోలీ ఇవ్వాలో తెలవదు

స్వచ్ఛ సర్వేక్షణ్ సభ్యుల అసంతృప్తి



ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న దీప్తి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని జనగామ గ్రామంలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ సభ్యురాలు దీప్తి నేతృత్వంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. ప్రస్తుతం జీపీ భవనంలో కొనసాగుతున్న ఆరోగ్య ఉపకేంద్రంలో ఆమె ఆశ కార్యకర్త, సిబ్బందితో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు, జ్వరంతో వచ్చే రోగికి ఏ మందులు ఇస్తారని వారిని ప్రశ్నించగా వారు సరిగా సమాధానం చెప్పలేదు. దీంతో దీప్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆరోగ్య ఉప కేంద్రంలో డస్ట్ బిన్‌లు అందుబాటులో లేకపోవడంతో వెంటనే ఆమె ఏర్పాటు చేయించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, మరుగుదొడ్ల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. వారి వెంట ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు జమున, అపర్ణ, ఉన్నారు.

బంజారాల సీత్లా సందడి

బంజారా మహిళలు సీత్లా ముత్యాలమ్మ, సీత్లా భవానీ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం సంప్రదాయ పద్ధతుల్లో మహిళలు నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



గజ్వేల్: ఏటిగడ్డ కిష్టాపూర్‌లో జరిగిన పండుగలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి



హుస్నాబాద్‌రూరల్: జిల్లెలగడ్డలో నైవేద్యాలతో తరలివస్తున్న గిరిజనులు



హుస్నాబాద్: ఊరేగింపుగా వస్తున్న గిరిజన మహిళలు

సంక్షిప్త వార్తలు

◆ బీసీ రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే

చేర్యాల(సిద్దిపేట): ఆర్డినెన్సు ద్వారా కాకుండా చట్టం చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం జరిగిన నాలుగు మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, ముస్త్యాల బాల్‌నర్సయ్య తో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టడానికి బీసీ రిజర్వేషన్లు తెస్తామని చెప్పడం సరికాదన్నారు. మల్లేశం, భిక్షపతి, సంతోష్, యాదగిరి, కరుణాకర్, సిద్దప్ప, శ్రీధర్ రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లిలో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ చాతరాజు ప్రశాంత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు.

◆ సచివాలయ ముట్టడి పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బుధవారం నిర్వహించనున్న సచివాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గుడికందుల రవి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు.

◆ హక్కులు పరిరక్షణ అందరి బాధ్యత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవడం అందరి బాధ్యత అని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లాశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉంటేనే సాధించగలం అన్నారు. కార్యక్రమంలో సైదులురెడ్డి, ప్రభాకర్, భూపాల్ రెడ్డి, పూర్ణ చందర్‌రావు, విజయ్‌కుమార్, భాస్కర్, శ్రీనివాస్, దామోదర్, బాలయ్య పాల్గొన్నారు.

◆ బీజేపీ సత్తా చాటాలి: బైరి శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మిరుదొడ్డిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జిగిరి అమర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఎన్నికల కార్యశాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు భిక్షపతి, దేవరాజు, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, యాదగిరి, లింగం, సత్యలక్ష్మి, రాజు, సదానందరెడ్డి, కరుణాకర్, చంద్రకుమార్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డుకు చెందిన కంకణాల రవి రెండు రోజుల క్రితం పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం రాష్ట్ర బీఆర్ఎస్ నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ పరామర్శించారు. తోబుట్టువు పథకం కింద ఇద్దరు ఆడపిల్లలకు రూ. 5 వేలు పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

◆ బంద్‌కు సహకరించండి

సిద్దిపేట(ప్రశాంత్‌నగర్): విద్యారంగ సమస్యల పరిష్కారానికై బుధవారం నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌కు బడ్జెట్ స్కూల్స్ యాజమాన్యాలు సహకరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. మంగళవారం ఆ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నేతలు శ్రీకాంత్, కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా నేతలు అభిషేక్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సిద్దిపేటనే లక్ష్యం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మంజుల

సిద్దిపేటజోన్: ప్లాస్టిక్ రహిత సిద్దిపేటనే లక్ష్యంగా పనిచేద్దామని మున్సిపల్ చైర్మన్ మంజుల పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ఆర్పీలతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరుబయట చెత్త పారబోసే వారికి జరిమానాలు విధించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలని, ప్రజలు జ్యూట్ బ్యాగ్‌లు వాడేలా చూడాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, వైస్ చైర్మన్ కనకరాజు, మెప్మా అధికారులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.